


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (ప్రారంభం)

1. మార్జాల చెలగాటం

**అనంతం ఏకాగ్రతతో** పని చేసుకుంటుండగా అప్పుడే ఇంటి నుంచి ఒచ్చాడు సింహాద్రి. సింహాద్రి అతన్ని తదేకంగా చూశాడు అది అతన్ని చూడటం మొదటిసారవ్వడం వలన. అలా చూస్తూ సరిగ్గా కూర్చోకపోవటం వలన కుర్చీ ఒరిగి, పడబోయి అది అపశకునంగా తోచింది. అనంతాన్ని చూడటం, అపశకునం సింహాద్రిని కలవరపెట్టాయి. లోకంలో అతనిని చికాకు పెట్టని అంశం లేదు. అతనికి ముందు చికాకు భూమి మీదికి దొర్లింది. చికాకుకు మనిషిని చంపేసే గుణం లేకపోవడం వలన ఇంతకాలం జీవించగలిగాడు. ప్రతి జీవితోనూ అతనికి అకారణ, సకారణ శత్రుత్వముంది. ఎవర్నీ అడగవలసిన అవసరం లేకుండా అనంతం ఎవరో సింహాద్రి గ్రహించాడు. కాకపోతే పేరు తెలియదు.

సింహాద్రి పొడవుగా, చామనఛాయగా ఉంటాడు. అందగాడూ కాదు, అనాకారీ కాదు. మరీ ఎత్తుకానీ పళ్లు. తనలో కల్మషం లేనట్టు తెల్ల దుస్తులను మాత్రమే ధరిస్తాడు. చురుకుగా ఉంటాడు. వారసత్వ వ్యాపారాన్ని ఫలవంతంగా నడుపుతున్నాడు.

అనంతం అందం సింహాద్రికి నచ్చలేదు. అంత అందం పురుషుడికైనా, స్త్రీకైనా అనవసరం అని అతని అభిప్రాయం. మన్మథుడు తన కొలువు మాని సింహాద్రి కొలువు చేరాడా? అతని అందం ఆకర్షించని చూపు ఉండదేమో! కూటికిలేక చిన్న ఉద్యోగాన్నైనా అపురూపంగా భావించే ఆ వ్యక్తి లాంటి వాళ్లకు అందం అనవసరపు కానుక. ఆ తర్కంలోని లోపాన్ని సింహాద్రి వెంటనే గ్రహించాడు. అందం ఎవరికీ 'అధికంగా అవసరం' వ్యభిచారులకు తప్ప? అసలు దాని మామూలు అవసరం ఏమిటి? అవసరమే అందాన్ని కలిగి ఉండటానికి అర్హతా? ఈగల్లా ముసరబోతున్న ఆలోచనలను తలవిదిలించి అదిలించాడు. అనంతం ప్రస్తుతం చేయవలసిన పనికి అందం అనవసరం. సింహాద్రి దృష్టిలో

ఆటంకం. ఆ అందం చూసి ఆనందించటానికి లేక మెచ్చుకోటానికి కాక కోపగించడానికి, భయపడటానికి సింహాద్రి అతని వైపు పదే పదే చూసాడు. చికాకును ఎవరి మీదో ఒకరి మీద వెళ్ళగక్కక తప్పదు పైత్యరసంలా. అనంతం తన కొలువులో చేరడానికి ఎవరు బాధ్యులో వారు కాక ఇంకెవరు శిక్షించబడాలి?

తండ్రి మృత్యుంజయ రావు ఈ మధ్య పనికిమాలిన పనులు చేస్తున్నాడు. ఏదన్నా మందలింపు పదం సింహాద్రి నోట దొర్లితే అగ్గి మీద గుగ్గిలం అవుతున్నాడు. ముసలితనం తెచ్చే మూర్ఖత్వానికి, జాడ్యాలకూ మందేది? వారంరోజుల క్రితం మందుల కంపెనీలతో పని మీద వెళ్లొచ్చేసరికి ఈ అందమైన కుర్రాడిని ఉద్యోగంలోకి తీసుకున్నాడు. తానొచ్చేంతవరకూ ఆగొచ్చుగా? వానప్రస్థం చేయవలసిన ఈ వయసులో ఈ లౌకిక విషయాల్లో తల దూర్చడం ఎందుకూ? తనకు సహాయపడటానికి బదులు తానే ఒక సమస్య అయ్యాడు. తన ఆధిపత్యాన్ని చాటుకోడానికి ఇవన్నీ చేస్తుంటాడని సింహాద్రి నమ్మిక.

కొన్ని విషయాలను తండ్రే కావచ్చు మరో ఆప్తుడే కావచ్చు పంచుకోడం సాధ్యం కాదు జీవితంలో. తనలోని కలవరాన్ని పంచుకోవటం అంటే ఎవరికీ ఏ విధంగా తెలియకూడని జీవిత రహస్యాన్ని పంచిపెట్టటమే. "అంత అందగాడు మన గుమస్తా పనికి అవసరమా?" అని తాను అంటే, 'దాని వలన మనకొచ్చిన ఇబ్బందేమిటి?" అన్న ప్రశ్న లేస్తుంది.

"అంత తొందరగా మరో వ్యక్తిని ఉద్యోగంలోకి తీసుకో వలసిన అవసరం మనకుందా, నాన్నా?"

"ఈ మధ్యే పని భారం అధికంగా ఉంది, మరో మనిషిని తెచ్చుకో వాలి అని నువ్వేగా అనింది?"

"అన్నానుగాని ఒక నిర్ణయానికి రాలేదుకదా? పోనీ నేను ఊరినుంచి వచ్చే దాకానన్నా ఆగవలసింది."

"ఇప్పుడేమీ కొంప మునగలేదుకదా? కొన్ని రోజులు చూసి నచ్చకపోతే పని నుండి తప్పించ వచ్చు. పొమ్మనకుండా పొగ పెట్టవచ్చు. ప్రభుత్వ ఉద్యోగమా? 'మానెయ్' అన్న ఒక్క పదం చాలు ఒదిలించుకోడానికి."

సింహాద్రి మనస్సు శాంతించింది, తల పండిన, కట్టుడు పళ్ళ తండ్రి మాటలతో. ఐతే మృత్యుంజయ మనసు చివుక్కుమంది. అహం కట్టెల మీద కూడా కాలదు, పెద్దపులిలా జీవితమంతా వేధించడమే కాక. తన మీద తానే పైసా ఖర్చుపెట్టుకోడానికి పరిపారి విధాలా ఆలోచిస్తాడు. జీవిత మంతా చీమలా కూడబెట్టాడు పుట్టలాంటి ఈ ఆస్తిని. ఎవరి గురించి? కొడుకు గురించీ కాదా? అలాంటి తనను కొడుకు తప్పుపట్టే ప్రయత్నం చేయడం మనసును కష్ట పెట్టింది. కొడుక్కంటే తండ్రి జాగ్రత్తపరుడు. పైసాకు వందరూపాయల విలువ కడతాడు. నా తండ్రి తప్పు చేయాలన్నా చేయలేడు అన్న నిశ్చితాభిప్రాయం వాడిలో ఎప్పుడు కలుగుతుంది? నిజానికి అతను జీవితంలో ఎవరిని పట్టించుకోవాలో వాళ్ళను పట్టించుకో లేదు. ప్రస్తుతం ఎవరిని పట్టించుకో వలసిన అవసరం లేదో వాళ్ళను అధికంగా పట్టించుకుని శాంతిని కోల్పోతున్నాడు. అతను ఆర్జనా వ్యసనమే ఆనందంగా జీవించాడు. భార్య ఒక విలువలేని వస్తువు. అతను మరిచిన భార్య లోకం వీడింది, ఆ విధంగానన్నా శిక్షించాలన్నట్టు. శిక్ష అనుభవిస్తున్నాడు. ఒక వ్యక్తిగా ఆమె ఇప్పుడు కావాలి.

ఒంటరితనం. ఈ వయసులోనూ బాధించే కామం. జీవితంసలిపే పుండు సమస్యలు సముద్రపు అలలు – కొన్ని భౌతికమైనవి, కొన్ని మానసికమైనవి. సంతానమే కాక కోడలూ ఖాతరు చెయ్యదు. ఆమె తన భర్తనే ఖాతరు చెయ్యదు. తాను, భర్తా కూడా ఆమె త్రోవలో ఆటంకాలు అన్న భావన ఆమెకుందేమో. వింతైన విషయం: సింహాద్రిని తాను కనడం ద్వారా ఆమెకు అపకారం చేశానన్న భావన ఆమెలో ఉండడం. ఆమెను కనడం ద్వారా ఆమె తల్లిదండ్రులు సింహాద్రికి అన్యాయం చేశారన్న భావన ఆమెలో ఉండదు. మనిషికి మరో మనిషి తోడుండడంలో కూడా ఏదో ఇబ్బందుంటుందేమో. భార్య పోయినప్పటినుంచీ ఏవో ఇబ్బందులున్నా తోడు అవసరం అని బాగా గ్రహించాడు మృత్యుంజయ.

ఉక్రోషం ఆపుకో లేక, అనంతం దగ్గిరకి వెళ్లి, "చూడబ్బాయీ, నీవు చాలా జాగ్రత్తగా పని చేసుకోవాలి, ఆషామాషీ కాదు మా దగ్గిర కొలువంటే" అన్నాడు, అంతకు ముందూ ఇవే మాటలు చెప్పున్నా. మృత్యుంజయ కొట్టబోగా భయపడ్డ గంగిరెద్దులా తల ఊపాడు అనంతం. మరింత వినయం కూడా చూపించాడు బోనసులా. ఇది తుమ్మితే ఊడే ముక్కని అనంతం గ్రహించాడు.

ఈశాన్యం మూలున్న దేవుళ్ళ మందిరం దగ్గరకు సింహాద్రి వెళ్లి, బొట్టు పెట్టుకుని, ప్రార్థన చేసి, క్రిందనున్న రాతి మీద ఒక కొబ్బరికాయను ఒకే దెబ్బతో సరిగ్గా సమంగా పగలకొట్టి, నీటిని గ్లాసుసులో పోసాడు. అది సరిగ్గా పగలక పోతే అపశకునంగా భావిస్తాడు. ఆనందించాడు. శకునం బాగుండటం వలన.

ఆ పనిలో సింహాద్రి నిమగ్నమయి ఉండగా వాహీద్, వినయ్, మూర్తి పెద్దగా మాట్లాడుకుంటూ ప్రవేశించారు.

"ముగ్గురు జ్ఞానులకూ స్వాగతం" అన్నాడు మృత్యుంజయ కట్టుడుపళ్లు కనిపించేట్టు నవ్వుతూ.

"అంత పెద్ద మాటలొద్దు, దూతలు అనండి. మందుల కంపెనీలకూ దూతలమేగా? సింహాద్రి శుభవార్త ఎపుడు చెబుతారో?" అన్నాడు వినయ్.

"ఎప్పుడో ఒకప్పుడు తప్పక చెబుతాడు" మృత్యుంజయ అన్నాడు సింహాద్రిని ఓదారుస్తున్నట్టు.

"ఓహ్, ప్రసాదం వేళకు దేవుడు మమ్మల్ని రప్పించాడు. ఎలా ఏది ప్రాప్తించాలో అలాగే పొల్లుపోకుండా జరుగుతుంది. వైష్ణవాలయాలలో దద్ధోజనం, పులిహోర, చక్కెరపొంగలి, కదంబం వగైరాలు నన్ను అలరింప చేస్తాయి. మా ఆవిడ చేస్తుంది గాని అవొక మోస్తరుగా ఉంటాయి. నేను దేవాలయ ప్రసాదాల గురించి మాట్లాడితే, పొరుగింటి పుల్లకూర అని మూతి తిప్పుతుంది. దేవుడు లేకపోతె ప్రసాదాల గురించైనా మనం సృష్టించుకోవాలి...సింహాద్రిగారూ, దేముడు మీ పట్ల ఉదారంగా ఉండాలంటే మీరు దేముడిపట్ల ప్రసాదాల విషయంలో ఉదారంగా ఉండాలి. ఒట్టి కొబ్బరికాయేంటండీ ప్రసాదంగా?" మూర్తి అన్నాడు.

కొబ్బరిని చిన్న చిన్న ముక్కలుగా కోసి వాటికి బెల్లం దట్టించి అందరి దగ్గిరికీ ఆ వెండి పళ్ళేన్ని తెచ్చాడు తమ్మయ్య లింగం .

“అత్యంత అల్పమైన పెట్టుబడితో అనల్పమైన లాభాలు ఆర్జించాలని చూస్తారు సింహాద్రి గారు. ఆయనకు వ్యాపార పెట్టుబడుల గురించీ వెన్నతో పెట్టిన పరిజ్ఞానం” వినయ్ అన్నాడు.

"తండ్రినుంచి ఆ సామర్థ్యం వారసత్వంగా ఒచ్చింది” వాహీద్ అన్నాడు.

"కొబ్బరికాయను పెట్టుబడిగా భావించడం అపచారం. భక్తికీ హృదయార్పణకు అది ఒక ప్రతీక, అంతే. కొండంత దేవుడికి కొండంత పత్రిని అర్పించలేము. ఒక వేళ ఇచ్చినా దేముడు తీసుకోడు. మనకే తిరిగి ఇచ్చేస్తాడు” మృత్యుంజయ అన్నాడు.

"ఎవరి దేముడికి సంబంధించిన ఏ నమ్మకాన్నైనా అపహాస్యం చేయడానికి నేను ఇష్టపడను. అలాంటి నమ్మకాలు హేతువుపై ఆధారపడి ఉండాలని కూడా నేను కోరుకొను. నన్నడిగితే నమ్మకం హేతువు పరస్పర శత్రువులు" అన్నాడు వాహీద్.

"వాహీద్ మాటలు వింటుంటే డౌటింగ్ థోమా కథ గుర్తుకొస్తోంది. ఏసు పునర్జీవుడయ్యాడని మిగతా పదునొకండు దూతలు చెప్పినా నమ్మని థోమాతో తనను పరీక్షించవచ్చని ఏసు అంటాడు. నీవు నా దేముడివి అంటాడు శిష్యుడు. నీవు నన్ను చూశావు గనుక నమ్ముతున్నావు. నన్ను చూడకపోయినా నా పునర్జీవనాన్ని నమ్మిన వారు ధన్యులు అని ఏసు మందలిస్తాడు” వినయ్ అన్నాడు.

"మనం సమయాన్ని వృథా చేస్తున్నాం అసలు పని మాని" వాహీద్ అన్నాడు.

"చిన్నదైనా కొబ్బరికాయ మనల్ని అంతగా ఆలోచింప చేసింది. దేవుడ్ని చూసి భయపడక్కర్లేదు. మనిషిని చూసి భయపడాలి గాని" చేతురుమాలతో చేతిని తుడుచుకుంటూ అన్నాడు మూర్తి.

"నెపాలు మన మీద ఉంచుకోము. ఎవరి మీదో, దేనిమీదో తోసేస్తాం నిప్పు కణిక ఒళ్ళో పడినట్లు. విధి, కర్మ, దేవుడు నెపాలుగా ఏర్పర్చుకున్నాం” వినయ్ అన్నాడు.

ముగ్గురూ సింహాద్రి బల్ల చుట్టూ కూర్చుని పనికి ఉపక్రమించారు చిత్రగుప్తుడు చిట్టాలలో తలలు దూర్చి. కాసేపటి మౌనం తర్వాత మృత్యుంజయ బయిటికి వెళ్ళిపోయాడు ఎవరికీ ఏమీ చెప్పకుండా, తన ఉనికిని ఎలాగూ గుర్తించడం లేదుకదా అనికూడా. సింహాద్రి ఇచ్చిన చిట్టా మూసి మూర్తి పెదవి విరిచి ఒట్టి పెదవులు చప్పరిస్తూ శబ్దాలు చేశాడు.

"ఈ మూడు నెలల కాలంలో అమ్మకాలు తగ్గిపోయాయి” అన్నాడు వాహీద్ తన చిట్టాను వెనక్కు ఇచ్చేస్తూ, ఇంకా పెళ్లవకుండానే ఏర్పడిన బట్టతలకు పట్టిన ముచ్చెమటను ఒట్టి చేత్తో తుడుచుకుంటూ.

"కృషితో దుర్భిక్షం నాస్తి అన్నారు కానీ ఎంత కృషి చేసిన దుర్భిక్షం తప్పటం లేదు” అన్నాడు విజయ్.

"దేవుడి దయ జనం మీద అధికంగాను, మన మీద స్వల్పంగానూ ఉంది” అన్నాడు మూర్తి.

"ఎవరి పక్షం వహించాలి అన్నది దేముడి నిత్య సమస్య కావచ్చు. ఒక్కో సారి ఒక్కొక్కరి పక్షం వహిస్తూ కాలం గడుపుకొస్తాడు” అన్నాడు విజయ్.

"నీలాగే ఒక సారి దేముడి పక్షం, ఒకసారి నా పక్షం వహిస్తూ ఉంటావు" మూర్తి అన్నాడు.

"దేముడికి సమస్యలుండవు. ఉంటే ఆయన దేముడు అవడు కదా. ఎవరి కర్మనుబట్టి వాళ్ళ బాధలుంటాయి. రోగాలూ దారిద్ర్యము ఉంటాయి" సింహాద్రి అన్నాడు అనంతాన్ని చూస్తూ.

"పోయిన త్రైమాసంలో జనం కర్మ మెరుగుగా ఉండుంటుంది. మన కర్మ ప్రతికూలంగా ఉండుంటుంది" వ్యంగ్యానికి గాంభీర్యపు తొడుగు వేసి మూర్తి అన్నాడు.

"మూర్తీ, నీకు దేవుడంటే కోపమా, మంచి జీవితాన్ని అనుభవిస్తూ కూడా?" వాహీద్ అడిగాడు, రుమాలతో తల తుడుచుకుని, తీయకుండా అలాగే ఉంచి.

"నేను కోపం ఉందన్నా, లేదన్నాదేవుని ఉనికిని పరోక్షంగా అంగీకరించినట్లేగా? దేవుడి గురించి నాకు తెలియదు. థోమాలా కంటితో చూసి చేత్తో నిమిరే అవకాశం కలగలా. అలాగని ఆ అనుభవం లేనందున దేవుడు లేడు అనదల్చుకోలేదు. మందుల వ్యాపారం ద్వారా బ్రతక గలుగుతున్నాం. రోగాలు, రొష్టులు చెడుగా భావిస్తాం. అవె మనకు మనుగడను ఇస్తున్నాయి" మూర్తి అన్నాడు కుర్చీని వెనక్కు జరుపుకుని కాలి మీద కాలు వేసుకుని.

"మనుషులు దుష్టకర్మలకు పాల్పడడం, కర్మ అనే వ్యవస్థ ఉండటం చేత మనం మందుల వ్యాపారం చేసుకుని జీవించగలుగుతున్నాం. అసలు మంచీచెడూ లేవేమో" వినయ్ అన్నాడు.

"అలాంటప్పుడు కర్మ వ్యవస్థ లేనట్టేనేమో" మూర్తి అన్నాడు.

"మిథ్యలో అనేక ఉప మిథ్యలు" వినయ్ అన్నాడు.

"వినయ్ భగవద్గీత కూడా క్షుణ్ణంగా చదివినట్టుంది, ఆసాంతంగా బైబుల్ కాక" సింహాద్రి అన్నాడు.

"వాహీద్ భాయ్ మౌనం వీడి చర్చలో పాలగుంటే మనకు ఉపయుక్తంగా ఉంటుంది" మూర్తి అన్నాడు

"ఏమీ బాగుండదు. మన వ్యాపారంలోకి దివ్య లోకం నుంచి దేవుడిని లాగడం ఎందుకూ?" జేవురించిన ముఖంతో అన్నాడు.

“దయ్యమంటే భయపడాలి గాని, దేవుడంటే భయం ఎందుకూ?"

"చిన్న చిన్న విషయాలలో దేవుడు జోక్యం చేసుకుంటాడని నేను అనుకోడం లేదు" సింహాద్రి అన్నాడు.

"చిన్న విషయాలకూ దేవుడిని ప్రార్థిస్తుంటాం గదా?" మూర్తి కవ్వింపుగా అన్నాడు.

"దీన్ని వితండవాదం అంటారనుకుంటా. అయన తన చర్యలను ప్రశ్నించే అధికారాన్ని మనకు ఇవ్వలేదు" వాహీద్ అన్నాడు.

"దేముడు మనకు ఇవ్వని హుక్కును, అధికారాన్ని మనచేతులోకి తీసుకుని దుశ్చర్యలుగా మనం భావించే వాటిని చేయడం లేదా?" మూర్తి అన్నాడు.

"ఇదీ తప్పే. ఈ తప్పు ఆ తప్పును ఒప్పు చేస్తుందా?" వాహీద్ కోపంగా అన్నాడు.

పరిస్థితి చేయిజారుతుందేమోనని అందరూ తమాయించుకుని ఎవరి కంపెనీ లెక్కలు వాళ్ళు తిరిగి చూసుకోవడం మొదలుపెట్టారు. ఫాను శబ్దం మాత్రం వినిపిస్తోంది. రాజుకున్న అగ్నిని ఆర్పడానికన్నట్టు ఎదురు బేకరీ నుంచి జీడిపప్పు బిస్కట్లు, ఫ్లాస్కులో ఇరానీ తేనీరు  తెచ్చి వెంటనే వాళ్లకు పళ్లేలలో సర్దడం మొదలు పెట్టాడు తమ్మయ్య.

"అతిథి దేవోభవా, ఆరగించండి" సింహాద్రి అన్నాడు.

"అతిథి దేవుళ్ళు ఇస్తే ఆరగించే వాళ్ళేగాని ఆతిథ్యాయాన్ని మెచ్చి వరాలు ఇవ్వలేరు. వాళ్ళ తరఫున దేవుడే ఇవ్వాలి" మూర్తి అన్నాడు ఒక బిస్కత్తునంతా  ఒకేసారి నోట్లో తోసుకుంటూ.

"ప్రతి దానికీ ప్రతిఫలాన్ని ఆశించే వ్యాపారినా నేను? దేవుడు మనకు భాషను, మాట్లాడే శక్తినీ వృథా చేయడానికి ఇవ్వలేదేమో. మీరు వచ్చిన పనేమిటి? అది ఒదిలి ఈ మాటల ద్వారా ఏ సత్యాలను కనుగొనగలం? ఈపాటికి మీ పని ముగిసి వెళ్ళిపోయుండే వాళ్ళు" సింహాద్రి అనునయంగా అన్నాడు.

"నేను దురుద్దేశంతో అనలేదు, సింహాద్రి గారూ."

అందరూ కూడబలుక్కుని లేచిపోయారు.

"సంతాన ప్రాప్తి రస్తూ" మూర్తి అన్నాడు.

"ఆ గ్రీకు శిల్పాన్ని ఏ సీమ నుంచి  తెచ్చారూ? బాగా వాడుకోండి" వాహీద్ అన్నాడు కళ్ళు పెద్దవి చేసి అనంతాన్ని చూస్తూ.

"మీకు ఉపయోగపడతాడనుకుంటే నిరభ్యంతరంగా తీసుకు పోవచ్చు" సింహాద్రి అన్నాడు.

మూకుమ్మడిగా వెళ్లిపోయారు. నిశ్శబ్దం నిట్టూర్చింది.

తాను చేయవలసినది నాణ్యమైన పని కాదని ఆ ఉద్యోగంలో చేరకముందే అనంతానికి తెలుసు. నాణ్యమైన పనికి అవసరమైన విద్యార్హతలు అతనికి లేవు. ఒకవేళ ఉన్నా ఏ ఉద్యోగం దొరికితే దాన్ని ముందు అందిపుచ్చుకోవాలేగాని ఎదురు చూసే అవకాశము లేదతనికి. ఎంతో కొంత  జీవనోపాధి కావాలి. ఆ తర్వాత మిగాతా విషయాల జోలికి వెళ్ళవచ్చు. మణులూ మాన్యాలు ఆర్జిద్దామన్నది మనసులో ఇంకా పుట్టని ఆలోచన.

ఎవరో స్త్రీ మూర్తి వచ్చి సింహాద్రితో మాట్లాడుతోంది. ఆమె మాట్లాడే విధానం, చనువు గమనించి ఆమె అతని కళత్రం అని గ్రహించాడు అనంతం. తల ఎత్తి  ఆమె మొహంలోకి చూడకుండానూ, ఆమె చాలా ఇబ్బందిని తనకు కలిగిస్తున్నట్లు, ఆమె ఎంత త్వరగా తనను వదిలితే తనకు అంత మేలన్నట్టు ఉంది భర్త వైఖరి. ఎంతసేపు అక్కడ ఉండి అతన్ని అంతగా ఇబ్బంది పెడదామా అన్నది ఆమె ఆలోచనలా ఉంది. ఆమెను ఆ విధంగానన్నా ఒదిలించుకో వచ్చని అతను కుర్చీలోనుంచి లేచి మందుల బీరువాలు దగ్గిరకు వెళ్లి చేతిలో ఉన్న జాబితాతో సరిపోల్చుతూ నిలబడ్డాడు. ఆమెను అతను ఆ విధంగా ఒదిలించుకున్నాడేగాని అతన్ని మరో విధంగా ఏడిపించగలదని అతను ఊహించలేదు. ఆమె అనంతం దగ్గరికి వెళ్లి అతనితో మాట్లాడటం ఆరంభించింది..

"కొత్తగా ఒచ్చాడు కదా అబ్బాయి" అని ఎవర్నో అడుగుతున్నట్టు అనంతాన్నే అడిగింది.

"అంతే కదా మరీ" సింహాద్రి అన్నాడు తనున్నచోటునుంచి.

"మరీ చిన్న వయసులోనే యువత ఇంతేసి చిన్న ఉద్యోగాలకు వచ్చేస్తున్నారు" ఆశ్చర్యాన్ని కొనితెచ్చుకుని అందామె.

"అలా ఉద్యోగాల్లోకి తీసుకో వద్దని ఉద్యమం చేపట్టు."

"కడుపు నిండిన వాళ్ళం కదా, మనదగ్గిర వెటకారాలకు కొదవా?"

కోపంగా ఆమెను చూస్తూ అనంతం వైపు తల విసిరాడు సింహాద్రి అతను వింటాడని. కావాలనే అలా అని భర్తకు చిరాకు తెప్పించదలచింది కనుక అతని తల విసురుడును పట్టించుకో లేదు.

భార్య మేధావి అని పిలువదగిన తెలివితేటలు కలిగి ఉండటం అతనికి నిరంతరం ఇబ్బంది కలిగించే విషయం అయింది. అలా అతన్ని తాను ఇబ్బంది పెట్టగలగడం ఆమెకు సంతృప్తినిస్తూ ఉంటుంది. ఆమె కావాలనే తనను ఆ విధంగా హింసిస్తుందని తెలుసు. చేయగలిగిందేమీ లేదు. గుర్రమయితే కళ్లెం వేయవచ్చు. పక్షయితే పంజరంలో పెట్టొచ్చు. డబ్బుగల  కుటుంబం అని దాని నుంచీ తన తండ్రి కోడల్ని తెచ్చాడు. పెళ్లాడినపుడు ఇష్టంగానే చేసుకున్నట్టు చేసుకుందిగాని క్రమేపీ తనకున్న ఉన్నత అభిరుచులు, ఆలోచించగల మేధ తన భర్తకు లేవని, గల్లాపెట్టె ముందు కూర్చుని నోట్లు లెక్కపెట్టుకోటమే గాని మరో గొప్ప ఆలోచనా శక్తి, అభిరుచి లేదని గ్రహించి ఆశాభంగం చెందింది. పులి మీది పుట్రలా పిల్లలు పుట్టకపోవటం తద్వారా కలిగిన ఒంటరితనం ఆమెకు సంతోషం లేకుండా చేశాయి.

"నీ పేరు?" అడిగింది.

చెప్పాడు అనంతం.

"ముచ్చటగా ఉంది" అనింది భర్త వైపు చూస్తూ.

ఆమె తనకు అంత దగ్గిరగా నిలబడి చనువుగా మాట్లాడటం అతన్ని గాబరా పెట్టింది. ఏదో ఊరట కలిగించింది అనంతానికి. ఒక వృక్షం నడిచి వచ్చి బాధిస్తున్న ఎండనుంచి కొన్ని క్షణాలు సేద తీర్చినట్టనిపించింది. ఉదయం నుంచి తన చుట్టూ ఉన్న మనుషులు, వాళ్ళ తీరు, తన పట్ల వాళ్ళ వైఖరి అతన్ని తీవ్రంగా గాయ పరిచాయి. ఇది ఉద్యోగమా శిక్షా అనిపించింది. ఇంత సున్నిత మనస్తత్వం తనకు ఎందుకుందా అని దాని మీద చికాకుపడ్డాడు. ఆమె నీడగానే కాక, ఆమె మాటల్లోని ఆప్యాయత  అతని పై మండుటెండవేళ కురుస్తున్న చిరుజల్లులా కూడా ఉంది. ఒకే సారి ఒకే క్షణం మర్యాదకై తల ఎత్తి చూసాడు. దట్టంగా కాటుక పెట్టిన ఆమె విశాల నేత్రాలు కరుణా సంద్రాలుగా తోచాయి. చూపు తీయగా ఉంది. తనను ఒక మనిషిగా గుర్తించగలిగిన మనసూ ఉందామెకు.  ఆమె గురించిన తన భావనలన్నీ భ్రమలే అయినా. ఆ తాత్కాలిక ఉపశమన జ్ఞాపకం మధురమైనదిగా కొంతకాలమన్న మిగిలుండక పోదు.  ఆమె స్వభావమే ఆమె పరిమళం. ఏ పుష్పం పోటీ పడ లేనిది.

ఆ సాయంత్రం తమ్మయ్య  అనంతాన్ని బయటకు తీసుకెళ్లాడు. కొన్ని చిల్లర మందుల దుకాణాలకు తీసుకెళ్లి పరస్పర పరిచయం చేసాడు. రెండు గంటల సమయం పట్టింది. అతను వేరే ప్రాంతం వాడు. ముప్పై సంవత్సరాలుగా ఈ ఊళ్ళో ఉంటున్నాడు. భాషలో యాస మాత్రం పోలేదు, భార్యా ఇద్దరు పిల్లలతో కలసి ఒక చిన్న పెంకుటింట్లో జీవిస్తున్నాడు. డబ్బులకు ఇబ్బంది లేదు తండ్రీ కొడుకుల ప్రేమపాత్రుడై ఉండటం వలన.  అతనిలో పెంపుడు జంతువు విశ్వసనీయతుంది. శారీరక శ్రమ అవసరమైన పనులన్నీ చేస్తాడు ఆనందిస్తూ. ముఖ్యంగా ప్యాకేజీ పెట్టెలు పార్సిల్ కార్యాలయాల నుంచీ తేవడం, విప్పడం. పంపేవాటిని మందులతో నింపి బిగించి రవాణా కార్యాలయాలకు చేర్చడం లాంటివి. చదువుకోక పోయినా మందుల పేర్లు, వాటిని ఏ రోగాలకిస్తారో కంఠతా వొచ్చు. ఒక్కో సారి సింహాద్రి ఆటపట్టిస్తాడు, డాక్టర్ గారూ అని పిలిచి. అతను సిగ్గుతో పామవుతాడు.  ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తి మనస్తత్వం, మనసులో దాగి ఉన్న ఆలోచనలూ క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. వాళ్ళనుద్దేశించింది ఒక పొల్లు కూడా  అతని నాలుక మీదినుంచి జారదు. కుక్క విశ్వాసంపై, గాడిద ఓపికపై పాఠాలు అతని దగ్గిరనుంచీ నేర్చుకోవాలి.  అతను రాత్రి తాగాబోయ్యే మందు గురించి పొద్దుటినుంచే ఎదురుచూస్తుంటాడు. అతనికి ఆనందం ఇచ్చే అంశాలలో ఒకటి తన సామర్థ్యం గురించి తానె ఆశ్చర్యపోతూ ఇతరులకు చెప్పుకోడం.

“నాలా ప్యాకేజీ పెట్టెలు కట్టే వాడు, విడగొట్టే వాడూ ఏ మందుల కంపెనీలో ఉండడు. ఇన్నేళ్ళుగా ఇక్కడ పనిచేస్తున్నానా, ఒక్క సారి గూడా నా పని గురించి ఒక్క ముక్క చిన అయ్యగారు కానీ, పెద్ద అయ్యగారు కానీ అనలేదు. వాళ్ళు మనుషులుగా పుట్టిన దేవుళ్ళు."

కొంత సేపట్లో దుకాణం చేరతారనగా లెంపకాయలాంటి వార్తను అనంతానికి చెప్పాడు.

"ఏందన్నా తప్పు పని చేసావా ఏందీ చిన్నయ్యగారు నీ మీద నా దగ్గిర విసుక్కున్నారు?"

"నాకు తెలిసి చెయ్యలేదు!"

"తప్పంటూ చేసే ఉంటావు, నీకు తెలిసుండక పోవచ్చు, నువ్వు చెయ్యకుండా విసుక్కోడానికి అయ్యగారికి సరదానా? అలాంటి సరదాలు నాకు తెలిసి వాళ్లకు లేవు” ధృడమైన నమ్మకంతో అన్నాడు తమ్మయ్య.

"చేసే ఉంటాను” అనంతం అన్నాడు తమ్మయ్యతో వాదించడానికి భయపడి.

"జాగ్రత్తగా పని చేసుకో. పొరబాటున కూడా వాదించక. ఒక మంచి కుటుంబానికి కోపం తెప్పించితే బూడిదవుతావు” అన్నాడు అనంతంపై చెలాయిస్తున్న ఆధిపత్యానికి ఆనందిస్తూ.

"అలాగే!" అని కుంచించుకుపోతూ ఏటి  దగ్గిర నీరు తాగుతూ తోడేలుకు చిక్కిన గొర్రెపిల్లలా అన్నాడు.

"మంచి కుటుంబం అంటే ఏమిటి?" అని అడిగే సాహసం చెయ్యలేదు. తమ్మయ్య కూడా ఆ మంచి కుటుంబంలోని వాడే అని మాత్రం భావించాడు. కొన్ని విషయాలు తెలియకపోయిన భావించేసుకోడం మంచిది ఆ విధంగా హానిని దూరంగా నెట్టేస్తూ.

మంచి కుటుంబం అంటే అర్థం త్వరలోనే అతనికి తెలిసిపోయింది. ఒక మనిషి మనసులో ఏది మంచి, ఏది చెడు అన్నది నిర్ణయించబడుతుంది అతని ఇష్టం అనిష్టం మీద ఆధారపడి.

ఆ తండ్రి కొడుకులను సంతృప్తిపరచడం వరాలనిచ్చే బ్రహ్మకు కూడా సాధ్యపడదు. అనంతం తన చర్మంతో చెప్పులు కుట్టించి సవినయంగా వారిద్దరికీ పూవుల్లో పెట్టి మరీ సమర్పించుకున్నా వాళ్లు సంతృప్తి పడని రకం. మూలిగే పెద్దరోగమున్న నక్కలు. మూలగడానికి అనంతం దగ్గిర ఏ ఒంకా దొరకక్కర లేదు. ఒంకల సృష్టిలో జంట దిట్టలు. వాళ్లకు ఆ రోగ పీడనలో సుఖముంది.

ఇక్కడ ఒక వింత విషయం చెప్పాలి. ఆమె అప్పుడప్పుడూ దుకాణానికి వచ్చేది. ఒచ్చినపుడు అనంతం దగ్గిర నిలబడి రెండు నిముషాలన్నా మాట్లాడేది. ఆమె కేవలం అనంతంతో మాట్లాడటానికి వస్తోందా అని సింహాద్రికి పెనుభూతం లాంటి అనుమానం. ఆమె అటు వెళ్ళగానే సింహాద్రికి అనంతాన్ని సాధించడానికి పుట్టెడు ఒంకలు దొరికేవి. ఆయుధాలతోనే గాక పదాలతో హత్యలు చేయవచ్చు. కనీసం ఆత్మహత్యకు పురికొల్పా వచ్చు. అనంతం ఆ హింసను భరించలేక తమ్మయ్య దగ్గిర మొర బెట్టుకున్నాడు, కన్నీటిని ఆపుకుంటూ.

"నీవు ఆడదానికన్నాఅధ్వాన్నం" అని తీర్పు ఇచ్చాడు.

ఓదార్పుకు పొతే మొట్టికాయ దక్కింది.

"వాళ్ళు ఒట్టి మాటలే కదా అన్నారు. కొట్టలేదు, కనీసం లెంపకాయివ్వలేదు, ఉద్యోగం పీకెయ్య లేదు. అవి జరిగితే ఏడువు. ఈ వయసులో అలాంటివి పట్టించుకో కూడదు. బూజు నెత్తి మీద పడ్డట్టు దులిపేసుకో వాలి. ఏ యజమానైనా వాడి దగ్గిర పని చేసే వాడిని తిట్టాడా? ముద్దు పెట్టుకుంటాడా? కొందరు కొడతారు కూడా. ఇంకెప్పుడూ వాళ్ళ మీద నాకు చెప్పక."

కొడుక్కు తండ్రి సహాయం చేస్తాడు అనంతాన్ని సాధించడంలో. ఒకసారి కట్టుడు పళ్ళు తీసి, ఒకసారి అవి పెట్టుకునే. రెండు విధాలా అతని మాటలు భయపెట్టేవి. నీరులేని బావి అడుగు ఒంటరి కప్ప స్వరం గుర్తుకొచ్చేది! వాళ్ళిచ్చే భృతి కేవలం వాళ్ళిచ్చే పనికి పరిమితమైనది. వాళ్ళు మాట్లాడే మాటలకు వాళ్ళు రూపాయ చెల్లించడం లేదు. అది అనంతానికి అక్కర్లేదు కూడా వాళ్లిస్తానన్నా. అనడం మానేయడం కావాలి. బతకటానికి డబ్బు కావాలి. దాని ఆర్జనకు కుక్కపాట్లు పడాలి.

కంపెనీ వ్యవహారాలూ చూసే న్యాయవాది ఒకసారి వచ్చి సింహాద్రితో మాట్లాడుతున్నాడు. ఒక ఎకరా స్థలం ఊరి బైట కొన్నారు. అది గొడవల్లో పడింది. మరుసటి రోజు న్యాయమూర్తి ముందు ఆ వ్యాజ్యం వస్తోంది. దానికి సంబంధించి

మరిన్ని దస్తావేజులు అవసరమొచ్చాయి. సింహాద్రి ఇంటికెళ్లి వాటిని తేవాలి. తమ్మయ్య ఎక్కడికో వేరే పని మీద వెళ్ళాడు. సింహాద్రే వెళ్లి వాటిని తేవడంకన్నా వేరే ఎవరినో పంపితే దుకాణంలోఈలోగా న్యాయవాదితో వ్యాజ్యం గురించి చర్చించవచ్చు సమయం వృథా కాకుండా.

"అనంతాన్ని పంపు బండి మీద" అన్నాడు మృత్యుంజయ.

"ఇల్లు తెలీదుగా అతనికి, వెదుక్కునే సరికి కాలం చెల్లుతుంది" చేదు తిన్నట్టు ముఖం పెట్టి అన్నాడు కొడుకు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS